క్లుప్తంగా

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న మెడికల్ ఆఫీసర్ దివ్యవాణి

పటాన్‌చెరు టౌన్: విద్యార్థులు పౌష్టికాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని సుల్తాన్‌పూర్ పల్లె దవాఖానా వైద్యాధికారి దివ్యవాణి అన్నారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ, మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో మిషన్ శక్తి సంకల్ప్ కింద 100 రోజుల ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం అమీన్‌పూర్ మండల పరిధిలో ఉన్న సుల్తాన్‌పూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో అవగాహన కల్పించారు. విద్యార్థులకు షీ- టీమ్, పోక్సో చట్టం, బాల్య వివాహాల నిషేధ చట్టం, ఆన్‌లైన్ భద్రత, లింగ సమానత్వం, లింగ వివక్షత, సఖీ సర్వీసెస్, చైల్డ్ లైన్ సేవలు, సైబర్ నేరాలు, పిల్లల అక్రమ రవాణా, మాదక ద్రవ్యాల నివారణ, ఆరోగ్యం, పోషకాహారం, హెల్ప్ లైన్ నంబర్లు (1098, 100, 181, 112, 1930) గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం, జెండర్ స్పెషలిస్ట్ యాదగిరి, షీటీమ్ హెడ్ కానిస్టేబుల్ శివ కుమార్, గ్రామ పంచాయతీ సెక్రటరీ మాణిక్యం, స్కూల్ హెచ్‌ఎం రమాదేవి, ఉపాధ్యాయులు, ఆశ, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్, పాఠశాలకు పొజిషన్ చూపించండి



స్థలాన్ని పరిశీలిస్తున్న అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి

పటాన్‌చెరు: అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌కు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిర్మాణం కోసం కేటాయించిన స్థలాన్ని అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండు రంగారెడ్డి, మండల తహసీల్దార్ రాధా పరిశీలించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడారు. మున్సిపల్ పరిధిలో వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు శాశ్వత ప్రాతిపదికన భవనాలు నిర్మించేందుకు అప్పటి ప్రభుత్వ స్థలాలను కేటాయించిందన్నారు. ఇందులో భాగంగా పాఠశాల, పోలీస్ స్టేషన్‌ల నిర్మాణాలకు పొజిషన్ చూపాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు చౌటకూరి బాల్ రెడ్డి, కౌన్సిలర్ కృష్ణ, కల్పన ఉపేందర్ రెడ్డి, కొల్లూరు మల్లేశ్, కో-ఆప్షన్ సభ్యులు తలారి రాములు, సీనియర్ నాయకులు కొల్లూరు యాదగిరి, చౌటకూరి మహిపాల్ రెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు పరిరక్షించండి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మండలం బీరంగూడ, కిష్టారెడ్డిపేట, అమీన్‌పూర్ తదితర ప్రాంతాల్లోని ప్రభుత్వ భూములను కాపాడాలని, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని, అక్రమ నిర్మాణాలను వెంటనే కూల్చివేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆపార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు మంగళవారం వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా అమీన్‌పూర్ పార్టీ మండల కార్యదర్శి జార్జ్ మాట్లాడారు. మండలంలోని ప్రభుత్వ భూములు, అసైన్‌మెంట్ భూములు, చెరువులు, కుంటలు, కాలువలు, దేవాదాయ భూములు శ్మశాన వాటికలు కబ్జాకు గురవుతున్నాయన్నారు. కోట్ల రూపాయల విలువ చేసే భూములేవీ కూడా ఆక్రమణదారులు విడిచిపెట్టడం లేదన్నారు. అక్రమంగా నిర్మాణాలు జరుగుతున్నా ప్రభుత్వ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. కబ్జాదారులపై చర్యలు తీసుకుని ప్రభుత్వ భూములను కాపాడాలని డిమాండ్ చేశారు. లేదంటే పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నర్సింహారెడ్డి శ్రీనివాస్ రెడ్డి వీరస్వామి పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

మునిపల్లి(అందోల్): టీపీఎస్ కంపెనీ సహకారంతో మంగళవారం ఖమ్మంపల్లి జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు డీఈఓ ఎస్.వెంకటేశ్వర్లు ఉచిత టీషర్టులు, బెల్టులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లక్ష్మారెడ్డి, రాజేశ్వరి, కృష్ణవేణి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా వదిలేశారు!

- ఖాళీగా మున్సిపల్ దుకాణాలు
- తొమ్మిదేళ్లుగా పట్టించుకోని అధికారులు
- లక్షల ఆదాయానికి గండి



నిరుపయోగంగా ఉన్న దుకాణాల సముదాయం

జహీరాబాద్ టౌన్: మున్సిపల్ కార్యాలయానికి వెనుకాలే ఉన్న దుకాణాల సముదాయాన్ని అధికారులు నిరుపయోగంగా వదిలేశారు. నెలకు లక్షల రూపాయల ఆదాయం వచ్చే షాపింగ్ కాంప్లెక్స్‌ను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. తొమ్మిది సంవత్సరాలుగా వ్యాపారులకు కేటాయించకుండా ఖాళీగా ఉంచారు. దీంతో మున్సిపల్‌కు వచ్చే ఆదాయానికి గండి పడుతుంది.

52 దుకాణాలు..

పట్టణంలోని భవానీ మందిరం రోడ్డులో 1990లో రూ.46 లక్షలు ఖర్చుచేసి 52 దుకాణాలను నిర్మించారు. అప్పట్లో నెలకు రూ.600 అద్దె ప్రాతిపదికన షాపులను వ్యాపారులకు కేటాయించారు. దుకాణాల అగ్రిమెంట్ గడువు ముగియడంతో అద్దె పెంచాలని 2016లో కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. కౌన్సిల్ సమావేశాల్లో ఇదే విషయంపై అధికారులను నిలదీశారు. స్పందించిన అప్పటి కమిషనర్ రూ.600 ఉన్న అద్దెను రూ.2500కు పెంచారు. కానీ కౌన్సిలర్లు సంతృప్తి చెందలేదు. అగ్రిమెంట్ సమయం ముగిసినందున టెండర్ పిలిచి వేలం పాట ద్వారా దుకాణాలను కేటాయించాలని పట్టుబట్టారు. అప్పట్లో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది. మున్సిపల్ అధికారులు వెంటనే దుకాణాలను ఖాళీ చేయించారు. దెబ్బతిన్న దుకాణాలకు తాత్కాలిక మరమ్మతులు చేయించారు. పనులు పూర్తి అయిన తరువాత షాపులకు బహిరంగ వేలం వేశారు. ఒక్కో దుకాణం అద్దె రూ.5వేల కంటె తక్కువ కాకుండా నిర్ణయించారు. 52 దుకాణాలకు గాను ప్రతీనెల మున్సిపల్‌కు సుమారు రూ.2.50 లక్షల ఆదాయం వస్తుందని అంచనా వేశారు.

పట్టించుకోని అధికారులు

కారణం తెలియదు కానీ.. దుకాణాలకు వేలం పాట వేసి తొమ్మిది సంవత్సరాలు గడుస్తున్నా ఇంతవరకు మున్సిపల్ అధికారులు వ్యాపారులకు షాపులను కేటాయించడం లేదు. దుకాణాల సముదాయం ఖాళీగా ఉన్నందున మున్సిపల్‌కు సంవత్సరానికి సుమారు రూ.25లక్షల వరకు వచ్చే ఆదాయానికి గండి పడుతుంది. కొంతమంది దుకాణాలను స్వాధీనం చేసుకుని వాడుకుంటున్నారు. అయినా మున్సిపల్ అధికారులు పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. మున్సిపల్ కార్యాలయం వెనకాలే దుకాణాల సముదాయం ఉన్నా వాటి గురించి అధికారులకు పట్టింపులేకపోవడం పట్ల ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌పై అధికారులు దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

> **దుకాణాల గురించి తెలియదు**
>
> 
>
> మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించి కొన్ని నెలలు అవుతుంది. మున్సిపల్‌కు చెందిన దుకాణాలు ఉన్నట్లు తనకు తెలియదు. పని ఒత్తిడి వల్ల మున్సిపల్ కాంప్లెక్స్‌కు సంబంధించిన దుకాణాలపై శ్రద్ధ చూపలేదు. పూర్తి వివరాలు తెలుసుకుని, వాటిని అద్దెకు ఇచ్చేలా చర్యలు తీసుకుంటా.
>
> –శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, జహీరాబాద్



రోడ్డుపై పారుతున్న మురుగు

రోడ్డుపై మురుగు.. జనం బేజారు

పట్టణంలోని గంజి మైదానంలో మంగళవారం డ్రైనేజీ పొంగి రోడ్డుపై మురుగు పారింది. దీంతో వాహనదారులు, దుకాణదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. నడుచుకుంటూ వెళ్లేవారు దుర్వాసన భరించలేక ముక్కుమూసుకొని వెళ్లాల్సి వచ్చింది. ఇలాగే ఉంటే దోమలు వ్యాప్తిచెంది వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి మురుగును తొలగించాలని కోరారు. – సంగారెడ్డి రూరల్:

ఎస్‌ఐకి రివార్డు అందించిన డీజీపీ



నగదు రివార్డు అందుకుంటున్న ఎస్‌ఐ ఆసిఫ్ అలీ

పటాన్‌చెరు టౌన్: విధి నిర్వహణలో ఇద్దరు ప్రాణాలు కాపాడిన పటాన్‌చెరు ఎస్‌ఐ ఆసిఫ్ అలీకి డీజీపీ జితేందర్ నగదు రివార్డు అందజేశారు. ఇటీవల రాజు అనే వ్యక్తి సాకి చెరువులో దిగి ఆత్మహత్యకు యత్నించగా సెక్యూరిటీ గార్డు సమాచారంతో ఎస్‌ఐ సకాలంలో అక్కడికివెళ్లి అతన్ని రక్షించారు. మరో ఘటనలో ముత్తంగి గ్రామంలో బహిర్భూమికి వెళ్లిన కమలమ్మ చెరువులో జారిపడి ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోతుండగా స్థానికుల సమాచారంతో ఎస్‌ఐ ఆమెను బయటికి తీసి ఆస్పత్రికి తరలించారు. ఈ రెండు ఘటనల్లో ఇద్దరి ప్రాణాలు కాపాడినందుకు జిల్లా ఎస్పీ కార్యాలయంలో మంగళవారం రివార్డు అందించారు. అదేవిధంగా అమీన్‌పూర్ పెద్ద చెరువులో చందానగర్ కు చెందిన ఓ మహిళ తన పిల్లలతో సహా దూకి ఆత్మహత్యకు యత్నించిన ఘటనలో నైట్ డ్యూటీ నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్, జానకి రామ్ ఇద్దరు కలిసి వారిని రక్షించినందుకు రివార్డు అందజేశారు. కార్యక్రమంలో ఐజీ సత్యనారాయణ, ఎస్పీ రూపేష్ కుమార్ పాల్గొన్నారు.

రసాభాసగా గ్రామసభ

- నిలిచిన రోడ్డు పనులపై వాగ్వాదం
- అధికార, ప్రతిపక్ష నేతల తోపులాట



గ్రామసభలో గొడవ పడుతున్న నాయకులు

కొండపాక(గజ్వేల్): గ్రామంలో నిలిచిపోయిన రోడ్డు విస్తరణ పనుల విషయంలో మంగళవారం నిర్వహించిన గ్రామసభలో తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటు చేసుకుంది. రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమై రెండేళ్ళు గడుస్తున్నా పూర్తి కాకపోవడాన్ని గ్రామస్తులు గ్రామసభ దృష్టికి తెచ్చారు. అలాగే ఇళ్లు, స్థలాలు కోల్పోయిన వారందరికీ డబుల్ బెడ్రూం అవకాశం కల్పించలేదన్న విషయాన్ని సైతం సమావేశం దృష్టికి తెచ్చారు. కాంట్రాక్టరు రోడ్డు పనులు సగంలో ఆపేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామంటూ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యంతో పనులు ఆగిపోయాయంటూ ప్రతిపక్షపార్టీ నాయకులు ఆరోపించడంతో అధికార పార్టీ నాయకులకు, ప్రతిపక్ష నాయకులకు మాటామాటా పెరిగి తోపులాటకు దారితీసింది. దీంతో కొద్దిసేపు గందరగోళ పరిస్థితి నెలకొంది. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి అమీనా భేగం మాట్లాడుతూ రోడ్డువిస్తరణ పనులు తొందరగా పూర్తయ్యేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయితీరాజ్ శాఖ ఈఈ చిరంజీవచారి, డిప్యూటీ ఈఈ అజయ్‌కుమార్, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి

పటాన్‌చెరు టౌన్: ఎస్సీ, ఎస్టీ కమిషన్ మెంబర్ రాంబాబును హైదరాబాద్‌లో మంగళవారం పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామికవాడకు చెందిన సువిన్ ఫార్మా కార్మికులు కలిశారు. ఈ సందర్భంగా సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. 15 – 20 ఏళ్లుగా పాశమైలారం పారిశ్రామిక వాడలోని సువిన్ ఫార్మా కంపెనీలో పని చేస్తున్నామన్నారు. హక్కుల సాధన కోసం యూనియన్ ఏర్పాటు చేసుకుంటే అప్పటి నుంచి పరిశ్రమ యాజమాన్యం ఇబ్బందులకు గురి చేస్తుందని తెలిపారు. అయితే ఈనెల 3 నుంచి పరిశ్రమ ఎదుట నిరసన కార్యక్రమాలు చేపడుతున్నా యజమాని మాత్రం స్పందించడం లేదన్నారు. సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ఆయన్ను కోరారు. కార్యక్రమంలో సువిన్ ఫార్మా కార్మికులు పాల్గొన్నారు.

రుణమాఫీ వివరాల సేకరణ

రాయికోడ్(అందోల్) : రుణమాఫీ కాని రైతుల వివరాలను సేకరిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి అభినాష్ వర్మ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం మాఫీ కాని 180 మంది రైతుల వివరాలపై విచారణ జరుపుతామన్నారు.

హెచ్‌ఎంను సస్పెండ్ చేయడం దారుణం

కొండాపూర్(సంగారెడ్డి): మధ్యాహ్న భోజనం నిర్వాహకులు చేసిన తప్పిదానికి ప్రధానోపాధ్యాయులను బాధ్యులు చేయడం సరికాదని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగారం శ్రీనివాస్ అన్నారు. మధ్యాహ్న భోజన నిర్వహణను ప్రత్యేక ఏజెన్సీల ద్వారా నిర్వహించాలని, ప్రధానోపాధ్యాయులను, ఉపాధ్యాయులను నిర్వహణ బాధ్యతల నుంచి తప్పించాలని కోరారు. వివరణ కోరకుండానే నేరుగా సస్పెండ్ చేయడం దారుణమన్నారు.

15న వ్యాసరచన పోటీ

రాయికోడ్(అందోల్) : మండలంలోని అల్లాపూర్ శివారులోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులకు ఈ నెల 15న వ్యాసరచన పోటీ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎంఎం.షరీఫ్ తెలిపారు. మంగళవారం ఆయన పాఠశాలను సందర్శించి పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు.

సంక్షిప్త వార్తలు

◆ నేడు స్వచ్ఛంద బంద్

పటాన్‌చెరు టౌన్: బంగ్లాదేశ్ లో హిందువులపై జరుగుతున్న హింసకాండకు నిరసనగా పటాన్‌చెరు డివిజన్ హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం స్వచ్ఛంద బంద్‌కు పిలుపునిచ్చారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని రామమందిర్ దేవస్థానంలో హిందూ ఐక్యవేదిక నిర్వహించిన కార్యక్రమానికి వివిధ పార్టీల నాయకులు, వర్తక సంఘం సభ్యులు, విద్యార్థి సంఘాలు, తదితరులతో సమావేశమయ్యారు. ఉదయం 8.30 గంటలకు రామమందిర్ నుంచి ర్యాలీ ప్రారంభమవుతోందన్నారు.

◆ గ్రామ కార్యదర్శిగా రాజేందర్

పటాన్‌చెరు టౌన్: నందిగామ గ్రామ కార్యదర్శిగా రాజేందర్ బాధ్యత స్వీకరించారు. పటాన్‌చెరు మండలం నందిగామకు చెందిన కార్యదర్శి రిజ్వాన్ బదిలీపై హత్నూర మండలం చందాపూర్‌కు వెళ్లారు. ఆ స్థానంలో చందాపూర్ పంచాయతీకి చెందిన రాజేందర్ పాటిల్ మంగళవారం బాధ్యతలు తీసుకున్నారు.

◆ జలమండలి ఎండీని కలిసిన కార్పొరేటర్

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : జలమండలి ఎండీ అశోక్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో రామచంద్రాపురం డివిజన్ కార్పొరేటర్ పుష్పనగేశ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. డివిజన్ పరిధిలోని పలు కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్ లైన్‌ల కోసం రూ.5.50 కోట్లలతో ప్రతిపాదనలు చేశామన్నారు. ఈ విషయంపై కొద్ది రోజుల క్రితం మంత్రి దామోదరను కలిశామన్నారు. దీనిపైనే జలమండలి ఎండీ అశోక్ రెడ్డిను కలిసి వినతిపత్రం ఇచ్చామన్నారు. వెంటనే 50 శాతం నిధులను మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. కార్యక్రమంలో నాయకులు మహీన్ గౌడ్, పీటర్‌లు పాల్గొన్నారు.

◆ రూ.2లక్షల ఎల్‌ఓసీ అందజేత

జహీరాబాద్: పట్టణానికి చెందిన ఈరమ్మ వైద్యం కోసం రూ.2లక్షల విలువ గల ఎల్‌ఓసీని కాంగ్రెస్ పార్టీ జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌చార్జి ఎస్.ఉజ్వల్‌రెడ్డి అందజేశారు. మంగళవారం జహీరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఈ మేరకు ఆమె కుటుంబ సభ్యులకు ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు పాల్గొన్నారు.

◆ అక్రమ షెడ్ల తొలగింపు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు శ్రీనగర్ కాలనీ సమీపంలో ఉన్న పాత జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాల మైదానంలో అక్రమంగా నిర్మించిన రెండు షెడ్లను మంగళవారం జేసీబీ సాయంతో ఎంఈఓ పీపీ రాథోడ్‌తో పాటు జీహెచ్ఎంసీ సిబ్బంది తొలగించారు. ఈ విషయమై అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్.. జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేశ్‌కు ఆదేశాలు జారీ చేశారు. దీంతో సిబ్బంది వెళ్లి తొలగించారు. అక్రమ నిర్మాణాలకు పాల్పడితే చర్యలు ఉంటాయని అధికారులు హెచ్చరించారు.

◆ ఎల్‌ఓసీ అందజేత

నారాయణఖేడ్: పెద్దశంకరంపేటకు చెందిన గంగారెడ్డి భార్య వైద్య చికిత్స కోసం జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ రూ.5 లక్షల ఎల్‌ఓసీ మంజూరు చేయించారు. ఈ మేరకు గంగారెడ్డికి మంగళవారం ఎల్‌ఓసీ పత్రం అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సత్యం తదితరులు ఉన్నారు.

◆ క్రికెట్ టోర్నీ ప్రారంభం

నారాయణఖేడ్: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని మంగళవారం నారాయణఖేడ్‌లోని తహసీల్ గ్రౌండ్‌లో నిర్వహించిన క్రికెట్ టోర్నీని ఆర్డీవో అశోక చక్రవర్తి ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ కృష్ణకుమార్, తహసీల్దార్ భాస్కర్, సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రమేశ్‌చౌహాన్, పండరిరెడ్డి, శంకర్ ముదిరాజ్ పాల్గొన్నారు.

◆ మెగా రక్తదాన శిబిరం

నారాయణఖేడ్: మండలంలోని అబ్బెంద పంచాయతీ కార్యాలయంలో గ్రామానికి చెందిన హన్మంతరావుపేట సుధీర్ ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని సుధీర్ మిత్రుల టీం ఆధ్వర్యంలో మంగళవారం మెగారక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ జిల్లా నాయకులు సుధాకర్‌రెడ్డి శిబిరాన్ని సందర్శించారు.

◆ పారిశుద్ధ్య పనులు తనిఖీ

నారాయణఖేడ్: మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో మంగళవారం తెల్లవారుజామున కమిషనర్ జగ్జీవన్ శానిటరీ అధికారి శ్రీనివాస్‌తో కలసి పర్యటించారు. రోడ్డు శుభ్రత, ఇళ్ల నుంచి తడి, పొడి చెత్త సేకరణ, పారిశుద్ధ్య పనులను అకస్మికంగా తనిఖీ చేశారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వహించరాదని ఆయన పారిశుద్ధ్య కార్మికులకు సూచించారు.

◆ నాణ్యమైన భోజనం అందించాలి

నారాయణఖేడ్: వసతిగృహాలు, వివిధ గురుకులాల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాయిరాం అన్నారు. మంగళవారం ఆయన నాయకులతో కలిసి మహాత్మాజ్యోతిబా పూలే బీసీ బాలుర గురుకులాన్ని సందర్శించారు. విద్యార్థులను అడిగి భోజనం నాణ్యతను అడిగి తెలుసుకొని వారితో కలిసి భోజనం చేశారు. సతీష్, సాయిసాగర్, శివకుమార్ పాల్గొన్నారు.

◆ స్వగ్రామాలకు విద్యార్థులు

నారాయణఖేడ్: కల్హేర్ మండలం బీబీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భోజనం వికటించి అస్వస్థతకు గురైన విద్యార్థులను మంగళవారం ఆర్డీఓ అశోక చక్రవర్తి పరామర్శించారు. విద్యార్థుల ఆరోగ్యపరిస్థితిని ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.రమేశ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం మెరుగుపడిన విద్యార్థులను వారి స్వగ్రామాలకు పంపించారు. ఆయనవెంట కల్హేర్ తహసీల్దార్ శివ శ్రీనివాస్, ఖేడ్ ఎంఈఓ విశ్వనాథ్ ఉన్నారు.

యువత మత్తుకు దూరంగా ఉండాలి



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధ్యాపకులు

కొండాపూర్(సంగారెడ్డి): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కేఎస్ రత్న ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, కామర్స్ విభాగం ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాలను ముట్టమని, వాటిని వినియోగించే వారి సమాచారాన్ని పోలీసులకు అందిస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి జగదీశ్వర్, అధ్యాపక బృందం డాక్టర్ మిథున్ రాథోడ్, డాక్టర్ నాగప్రసాద్, కామర్స్ విభాగ అధిపతి డాక్టర్ వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత



పిరమిడ్ మాస్టర్ సాయిలుకు సన్మానం

సదాశివపేట(సంగారెడ్డి): ధ్యానం చేయడంతోనే మానసిక ప్రశాంతత, ఏకాగ్రత ఆత్మవిశ్వాసం, ఆత్మస్థైర్యం, జ్ఞాపకశక్తి, సంకల్ప సిద్ధిస్తుందని పీఎంసీ పిరమిడ్ బోధన్ మాస్టర్ సాయిలు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని సత్యసాయి, భాష్యం, సరస్వతి శిశు మందిర్ వివిధ పాఠశాలల్లో విద్యార్థులకు ధ్యానంపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సదాశివపేట పిరమిడ్ మాస్టర్ బాయిని కృష్ణ, రాజు, సంఘం జిల్లా ఆర్య వైశ్య సంఘం అధ్యక్షురాలు పురం రజిని కృపాకర్ పాల్గొన్నారు

విజయోత్సవ సభకు తరలిన నాయకులు



జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పించిన నాయకులు

జహీరాబాద్: నగరంలో జరిగిన విజయోత్సవ సభకు ఎమ్మార్పీఎస్ నాయకులు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. కోహీర్ మండలం చింతలగట్టు గ్రామ క్రాస్ రోడ్డులో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వాహనాల్లో హైదరాబాద్ తరలివెళ్లారు. తరలి వెళ్లిన వారిలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అబ్రహం మాదిగ, నాయకులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొట్టి బోల్తాపడిన లారీ



దిగ్వాల్ గ్రామం వద్ద బోల్తా పడిన లారీ

జహీరాబాద్: కోహీర్ మండలం దిగ్వాల్ గ్రామంలో 65వ జాతీయ రహదారిపై అదుపుతప్పి లారీ బోల్తా పడిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. ప్రమాదంలో డ్రైవర్, మరో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. చెత్త కాగితాల లోడ్‌తో వెళుతున్న లారీ అతివేగంగా, అజాగ్రతగా నడపడం వల్లే ప్రమాదం జరిగినట్లు ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి జహీరాబాద్ వైపు వెళుతూ సర్వీసు రోడ్డువైపు బోల్తా పడింది. ఇదే ప్రదేశంలో ఇటీవల రెండు కార్లు సైతం అదుపు తప్పి బోల్తా పడ్డాయి. పోలీసులు ప్రమాద హెచ్చరికగా బారికేడ్లను, సూచికలను సైతం ఏర్పాటు చేశారు. అయినా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని గ్రామస్థులు పేర్కొన్నారు. లారీ బోల్తా పడిన సమయంలో అక్కడ ఎవరూ లేక పోవడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లయిందన్నారు.

అభ్యంతరాల స్వీకరణ



సమావేశంలో పాల్గొన్న అధికారులు, రైతులు

సంగారెడ్డి: ట్రిబుల్ ఆర్‌లో భూములు కోల్పోతున్న రైతులతో మంగళవారం అధికారులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారి నుంచి అభ్యంతరాలు స్వీకరించారు. ఎలాంటి పొరపాట్లు ఉన్నా సరిచేసి తగిన నష్టపరిహారం చెల్లిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఆర్‌ఓ ఈశ్వరిరాణి, ఆర్‌ఐ నాగరాజ్ పాల్గొన్నారు.

కాలేజీ అభివృద్ధికి సహకరించండి



భెల్ ఏజీఎం సురేన్‌ప్రసాద్‌కు పూలమొక్కను అందజేస్తున్న ప్రిన్సిపాల్ రవీందర్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భెల్ టౌన్‌షిప్ పరిపాలన విభాగం ఏజీఎం సురేన్ ప్రసాద్‌ను బీహెచ్ఈఎల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్ ఆధ్వర్యంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ కాలేజీలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనికి సానుకూలంగా స్పందించి, కాలేజీ అభివృద్ధికి తన వంతు పూర్తి సహకారాలు అందిస్తానని తెలపారన్నారు.

మోడల్ స్కూల్‌లో బదిలీలు చేపట్టాలి

ఝరాసంగం(జహీరాబాద్): తెలంగాణ మోడల్ స్కూళ్లలో ఉపాధ్యాయ బదిలీలు చేపట్టాలని తెలంగాణ మోడల్ స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు అశోక్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రమైన ఝరాసంగం మోడల్ స్కూల్ ఆవరణలో ఉపాధ్యాయులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ శాఖలలో బదిలీలు చేపట్టినా మోడల్ స్కూల్లో మాత్రం చేపట్టలేదని గుర్తు చేశారు. కోర్టు కేసును త్వరగా పరిష్కరించి బదిలీలు చేపట్టాలన్నారు. 010 ద్వారా వేతనాలు అందించాలన్నారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ ఈ నెల 21న ధర్నా చౌక్‌లో చేపట్టనున్న నిరాహార దీక్షలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేందర్, సందీప్, సూర్యనారాయణ, రాజేశ్వర్, నాజీనీన్, ముబీన్, శ్రీలేఖ, నర్సింలు, రవీందర్, సుజన, సంగమేష్, నర్సింలు పాల్గొన్నారు.